# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ షెడ్యూల్డ్ తెగలతో సహా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో రైల్వేల అభివృద్ధి చాలా ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు.
- ❖ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల కేంద్రనిమంత్రి నితిన్ గడ్కరీ కోరారు.
- ❖ చైనాలో విజృంభిస్తోన్న హెచ్.ఎం.పీ.వీ.పై ఎలాంటి ఆందోళన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా అన్నారు.
- ❖ ఉత్తర భారతదేశం అంతటా వరుసగా నాల్గవ రోజు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

==========================

షెడ్యూల్డ్ తెగలతో సహా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈరోజు రాష్ట్రపతి భవన్ లో వివిధ రాష్ట్రాల పంచాయతీరాజ్ సంస్థలకు చెందిన షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళా ప్రతినిధులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ... మహిళా సాధికారత భారత ప్రజాస్వామ్యానికి వెన్నెముకని అన్నారు. రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించిందని రాష్ట్రపతి మాట్లాడుతూ...

(వాయిస్ 34 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పలు రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులకు దృశ్యమాధ్యమ విధానంలో శంకుస్థాపన చేశారు. జమ్మూ కాశ్మీర్, తెలంగాణ, ఒడిశాలలో ప్రారంభించిన ఈ రైల్వే ప్రాజెక్టుల ద్వారా ఆప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి జరుగుతుందన్నారు. "వికసిత్ భారత్" లక్ష్య సాధనలో రైల్వేల అభివృద్ధి చాలా ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, దేశంలోని అన్ని ప్రాంతాలను అనుసంధానించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

అదేవిధంగా తెలంగాణలోని చర్లపల్లి న్యూ టెర్మినల్ స్టేషన్ ను ప్రారంభించారు. తూర్పు కోస్త రైల్వే పరిధిలోని రాయగడ రైల్వే డివిజన్ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. కాగా రాయగడ రైల్వే డివిజన్ ఒడిశా - ఆంధ్రప్రదేశ్ సమీప ప్రాంతాల అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది.

==========================

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ తో అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివన్ ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఇరువురు చర్చించారు. భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేయడంలో జేక్ సుల్లివన్ అందిస్తున్న వ్యక్తిగత సహకారాన్ని సామాజిక మాధ్యమం వేదికగా జైశంకర్ అభినందించారు.

==========================

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈరోజు 8వ బడ్జెట్ పూర్వ సంప్రదింపులు కార్మిక సంఘాల ప్రతినిధులతో జరిగింది. 2025-26 కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ఈ సమావేశాలను గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక శాఖ, పెట్టుబడులు, పబ్లిక్ అసెట్ మేనేజ్మెంట్ విభాగం, ఆర్థిక వ్యవహారాల విభాగం, కార్మిక మంత్రిత్వ శాఖ, ప్రధాన ఆర్థిక సలహాదారులు పాల్గొన్నారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 8వ తేదీన ఆంధ్రప్రదేశ్ లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఉత్తరాంధ్రలో 2 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద NTPC గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద దేశంలో చేపడుతున్న మొట్ట మొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్ట్ ఇది. ఆ మరుసటి రోజు అనగా 9వ తేదీన ఒడిషా చేరుకొని 18వ "ప్రవాసీ భారతీయ దివస్"ను ప్రారంభించనున్నారు

విరామం

==========================

చైనాలో విజృంభిస్తోన్న హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపీవీ)పై ఎలాంటి ఆందోళన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా అన్నారు. హెచ్ఎంపీవీ కొత్త వైరస్ కాదని, 2001లో తొలిసారి గుర్తించగా, చాలా సంవత్సరాలు ఈ వ్యాధికి సంబంధించిన కేసులు నమోదువుతున్నాయన్నారు. శ్వాసక్రియ ద్వారా హెచ్ఎంపీవీ వ్యాప్తి జరుగుతుందని అన్నారు. దేశంలో ఎలాంటి ఆరోగ్య సవాళ్లు ఎదుర్కొనేందుకైనా సిద్ధంగా ఉన్నామని కేంద్రమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 38 సెకన్లు)

==========================

ఉత్తర భారతదేశం అంతటా కనిష్ట ఉష్ణోగ్రతలు వరుసగా నాల్గవ రోజు నమోదవుతున్నాయి. అనేక నగరాల్లో ఉష్ణోగ్రతలు తగ్గడం, దట్టమైన పొగమంచు కారణంగా దృశ్యమానతను తగ్గిస్తుంది. పొగ మంచు ప్రభావంతో పలు నగరాల్లో రైలు, విమాన సర్వీసులు రద్దవుతున్నాయి. ఉత్తరాఖండ్‌లో, 3,300 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలలో మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. లడఖ్‌లో సాధారణంగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా మంచు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా శ్రీనగర్ నుంచి కార్గిల్ రహదారి, కార్గిల్ నుంచి జన్‌స్కార్ రోడ్డు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దేశ రాజధానిలో ఢిల్లీలో ఈ రోజు ఉదయం అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది, ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి.

==========================

విద్యార్థులు రోడ్డు నిబంధనలను పాటించటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ రోజు ముంబై నగరంలో సడక్ సురక్ష అభియాన్ 2025 'సురక్ష రీలోడెడ్' కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... విద్యార్థులు తమకే కాకుండా ఇతరులకు కూడా రహదారులను సురక్షితంగా మార్చేందుకు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. గత సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగాయని, కేవలం పాఠశాలల పరిసర ప్రాంతాల్లోనే ఈ ప్రమాదాల కారణంగా 10 వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. చిన్న చిన్న ట్రాఫిక్ నిబంధనలకు కూడా పాటించినట్లయితే ఇతరులను రక్షించడంలో సహాయపడతారని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========================

భారతదేశ యువత ఎంతో శక్తిమంతులని నావల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి అన్నారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన ఎన్‌సిసి రిపబ్లిక్ డే క్యాంప్ 2025ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ... యువతే దేశానికి భవిష్యత్ నాయకులని, 2047లో "వికసిత్ భారత్‌లో" కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఐక్యత, దేశభక్తి, సామాజిక సేవ విలువలు యువతను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దడంలో సహాయపడతాయన్నారు. యువత జీవితంలో సరైన అవకాశాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిసాయి. ఈరోజు సెన్సెక్స్ 79,223 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 1258 పాయింట్ల నష్టంతో 77,964 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 388.70 పాయింట్లు నష్టపోయి 23,616 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 3 పైసలు క్షీణించి 85.82గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 76.30 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,645 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

==========================
==========================